ప్రజాశక్తి

ఆదివారం 14 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

రోగులు కిటకిట

- అదుపులోకి రాని అతిసార
- 273కు చేరిన బాధితులు
- అనధికారికంగా 500 మందిపైనే
- దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు
- మంత్రి నారాయణ పర్యటన
- ఆర్‌ఆర్ పేటలో సిపిఎం విస్తృత సేవలు
- వైద్య శిబిరానికి రోగుల తరలింపు
- సమస్యలను మంత్రి, జెసి దృష్టికి తీసుకెళ్లిన బాబూరావు

వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

న్యూ రాజరాజేశ్వరిపేటలో అతిసార ఇంకా అదుపులోకి రాలేదు. గంట గంటకూ కేసుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రత్యేక వైద్య శిబిరం, జిజిహెచ్ అతిసార రోగులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం రాత్రికి అధికారికంగా మొత్తం కేసులు 273కు చేరాయి. శుక్రవారం రాత్రితో పోలిస్తే అదనంగా 79 కేసులు నమోదయ్యాయి. అయితే అనధికారికంగా 500 మందికిపైగా బాధితులు ఆస్పత్రుల పాలయ్యారని, ముగ్గురు మృతిచెందారని అంచనా. అతిసార విజంభిస్తున్నా ఇప్పటివరకు అధికారులు వ్యాధి ప్రబలడానికి గల కారణాలను గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 22వ తేదీ నుండి కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు విజయవాడ ఉత్సవ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారం యంత్రాంగం హడావుడి చేస్తోంది. ఈ ఉత్సవాలపై అతిసార ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన నెలకొనడంతో అధికారులు ఆ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మంత్రి నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ, జెసి ఇలక్కియ తదితరులు శనివారం ఆర్‌ఆర్ పేటలో పర్యటించి బాధితులను పరామర్శించారు. అతిసార బాధితులకు సిపిఎం నేతలు సిహెచ్.బాబురావు, బి.రమణారావు, కె.దుర్గారావు తదితరులు విస్తృత సేవలందించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరా తీశారు. ఇళ్లకే పరిమితమైన కొంతమంది బాధితులను బాధితులను గుర్తించి వైద్య శిబిరానికి తరలించారు. రోగుల పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను నీటితో శుభ్రం చేశారు. బాధితుల పరిస్థితిని, సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నారాయణను కలిసి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని, బాధితులకు సౌకర్యాలను మెరుగుదల చేయాలని డిమాండ్ చేశారు.

... వార్తలు మెయిన్, టబ్లాయిడ్‌లో

మంత్రి నారాయణతో మాట్లాడుతున్న సిపిఎం బాబూరావు

ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం బృందం

నీటి కోసం ఎగబడుతున్న జనం

గొంతెండుతోంది... గోడు పట్టించుకోరూ..!

- అన్నపానీయాల కోసం అల్లాడుతున్న న్యూ ఆర్‌ఆర్‌పేట వాసులు
- మంచినీటి కోసం ఎగబడుతున్న జనం
- ఒక్కో ఇంటికి ఒక క్యాన్ మాత్రమే పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: అతిసార ప్రబలడంతో గత ఐదారు రోజుల నుంచి న్యూ ఆర్‌ఆర్‌పేట వాసులు అల్లాడుతున్నారు. కనీసం తాగడానికి మంచినీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. డివిజన్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను క్లీన్ చేయడంతో పాటు పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా వ్యవస్థ మొత్తాన్ని గత రెండు రోజుల నాడు నిలుపుదల చేశారు. రక్షిత మంచినీటి సరఫరాకు సంబంధించి ప్రత్యమ్నాయంగా పూర్తిస్థాయి ఏర్పాట్లను ప్రభుత్వ అధికారులు విస్మరించారు. దీంతో రోజు వారీ అవసరాలకు ఏమో కానీ కనీసం గొంతు తడుపుకోవడానికి కూడా మంచినీటి చుక్క కూడా కరువైందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సుదూరు ప్రాంతాలకు వెళ్లి రూ.20 నుంచి 30 వెచ్చించి వాటర్ క్యాన్‌ను తెచ్చుకుంటున్నారు. ప్రజల నుంచి వస్తున్న నిరసనలు, డిమాండ్ నేపథ్యంలో రెండు మూడు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేసిన అధికారులు శుక్రవారం ఆర్‌ఒ ప్లాంట్స్ నుంచి మంచినీటి క్యాన్లను మినీ వ్యాన్ ద్వారా తీసుకొస్తూ ఒక్కో కుటుంబానికి ఒక క్యాన్ చొప్పున (మిగతా 2లో)

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఎప్పుడో !

కృష్ణాలో 2828 కుటుంబాలు గుర్తింపు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు, సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని చెబుతూ జిల్లాల వారీగా పథకానికి అర్హులైన లబ్దిదారులను గుర్తించారు. దీని అమలుకు ప్రభుత్వం జివోను విడుదల చేసినా క్షేత్రస్థాయిలో అమల్లోకి రాలేదు. అగస్టు ఏడో తేదీ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం వెంటనే అమల్లోకి వస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అమలుకు నోచుకోకపోవడంతో అగస్టు నెల బిల్లలను సెప్టెంబర్‌లో నేతన్నలు

చెల్లించాల్సి వచ్చింది. చేనేత రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న (మిగతా 2లో)

మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

దుర్గగుడిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీష శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్‌తో కలసి కలెక్టర్ దుర్గగుడితో పాటు ఇంద్రకీలాద్రి దిగువున జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలన చేశారు. కొండపైన భాగమున దసరా ప్లాన్ పరిశీలన, కొండపైన ప్రవేశ ద్వారాలు, అమ్మవారి దర్శనానంతరం యాత్రికులు కొండ దిగువకు వెళ్లే మార్గాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ప్రధానంగా యాత్రికులు ఉచిత దర్శనం క్యూలైన్ల మార్గాన్ని పరిశీలన చేసి దుర్గగుడి అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో యాత్రికులకు నిరంతరం మంచినీటి సౌకర్యం, చంటి పిల్లలకి పాలు, బిస్కెట్లు సప్లై చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కొండపైన విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు పరిశీలించి తగు సూచనలు చేశారు. దసరా ఉత్సవాల వేళ ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణాన్ని అంచనా వేస్తు ఇంద్రకీలాద్రికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్‌టి కృష్ణబాబు

2026 అక్టోబర్‌కు మచిలీపట్నం పోర్టు సిద్ధం

ఎమ్‌టి కృష్ణబాబు

వార్త మెయిన్‌లో

కృష్ణాజిల్లా ఎస్‌పిగా విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లా ఎస్‌పిగా వాసన విద్యాసాగర్ నాయుడును

నియమిస్తూ రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ నాయుడు కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు.

మొదటిపేజీ తరువాయి

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఎప్పుడో !

పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకం అమలు కోసం నేతన్నలు ఎదురు చూస్తున్నారు.

జిల్లాల వారీగా పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ మగ్గాలపై పనిచేసే చేనేత కుటుంబాలను చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించారు. కృష్ణాలో ఎక్కడా పవర్‌లూమ్ యూనిట్లు లేవని నిర్ధారించారు. హ్యాండ్ లూమ్ మగ్గాలతో వస్త్రాలను నేస్తున్న 2,828 కుటుంబాలను గుర్తించారు. నివేదికను ప్రభుత్వానికి అందించారు. 2025 మార్చి 6న ఉచిత విద్యుత్ అమలుకు జీవోను విడుదల చేసినా, ఈ పథకం అమల్లోకి రాలేదు. ఏదో ఒక కారణాన్ని చెపుతూ ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపుతున్నాయి. ఈ క్రమంలోనే 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే ఒక్కో కుటుంబం నెలకు రూ.850 వరకు బిల్లు చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలోని ఈ పథకానికి అర్హత కలిగిన 2,882 నేత కుటుంబాలు నెలకు రూ.24.03,800 లక్షలు చొప్పున ఏడాదికి రూ.2 కోట్లు 88 లక్షల 45 వేల 600 విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాయి. ఉచిత విద్యుత్ అమల్లోకి వస్తే నేత కుటుంబాలపై ఈ మేరకు భారం తగ్గుతుంది. ఈ క్రమంలో వెంటనే ఉచిత విద్యుత్ అమలుకు చర్యలు తీసుకోవాలని నేతన్నలు కోరుతున్నారు.

పథకాన్ని వెంటనే అమలు చేయాలి

గోరు రాజు, చేనేత కార్మిక సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి

చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండటం లేదు. వచ్చే అరకొర ఆదాయంతో విద్యుత్ బిల్లులు చెల్లించడం కష్టంగా మారింది. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా నేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమల్లోకి తీసుకు వస్తామని ప్రభుత్వం చేనేత దినోత్సవం రోజున ప్రకటించింది. దీని అమలుకు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. లబ్ధిదారులుగా గుర్తించిన చేనేత కుటుంబాలు సెప్టెంబర్‌లో బిల్లులు చెల్లించాల్సి వచ్చింది. వెంటనే పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

గొంతెండుతోంది... గోడు పట్టించుకోరూ..!

సరఫరా చేశారు. అయినా పూర్తి స్థాయిలో నీరందడంలేదు. ఒక వీధికి వస్తే...మరొక వీధికి రావడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మినరల్ వాటర్ క్యాన్లతో మినీ వ్యాన్ రాగా పెద్ద సంఖ్యలో మహిళలు చుట్టుముట్టారు. మంచినీటి కోసం మహిళలు గుమిగూడుతూ నెట్టుకున్నారు. పలువురు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. సదరు వ్యాన్‌కు చెందిన వర్కర్స్ డోరు టు డోర్ నెంబర్లు గుర్తు పెడ్తూ ఒక్కొక్క కుటుంబానికి ఒక క్యాన్ పంపిణీ చేసే క్రమంలో పెద్ద ఎత్తున అలజడి చోటుచేసుకుంది. నీటి కోసం జనం ఒక్క సారిగా ఎగబడ్డారు. గత నాలుగైదు రోజుల నుంచి మంచినీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని, ఈ రోజు క్యాన్లతో వ్యాన్ వచ్చినా ప్రయోజనం లేదని, సరిపోయే రీతిలో మంచినీటిని సరఫరా చేయడం లేదని స్థానిక నివాసి చెన్నుపల్లి దుర్గ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్క క్యాన్ ఇంటిల్లిపాది ఎలా సర్దుకోవాలని, తాగడానికే సరిపోవని, స్నానాలు, ఇతర అవసరాలకు నీరు లేక పిల్లలు, పెద్ద వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపింది. ఈ వీధికొచ్చిన మంచినీటి వ్యాన్ అవతల వీధికి రావడం లేదని, ఇంటి నెంబర్ గుర్తించి, మంచినీటి క్యాన్ ఇవ్వడం ఏమిటని సుశీల ప్రశ్నించింది. కిడ్నీల్లో రాళ్లు ఉన్నాయని, కనీసం తాగడానికి కూడా మంచినీరు దొరకడం లేదని, ఏ ఒక్కరూ కూడా పట్టించుకోవడం లేదంటూ కె.రమణమ్మ, రోజువారీ అవసరాలకు నీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నట్లు మేరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగైదు రోజుల నుంచి పనులకు కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని, రోజుకు ఐదారు వందలు ఖర్చు చేసి బయట భోజనం తెచ్చుకోవాల్సి వస్తోందని, మొక్కుబడి చర్యలతో అధికారులు చేతులుదులుపుకుంటున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా న్యూఆర్ఆర్‌పేట వాసులకు మంచినీటి సరఫరాతో పాటు భోజన సదుపాయం, ఆర్థిక సాయం, మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల గోడు పట్టేనా?

- సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని పోరాటం
- రేపు రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబం మొత్తం వీధిన పడుతుంది. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందితే ఉపయుక్తంగా ఉంటుంది. ఆ ఉద్దేశంతో భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. నిధులను దారిమళ్లించి కార్మికుల పొట్టగొట్టింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వమైన తమ గోడును పట్టించుకుని సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు సోమవారం రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది కార్మికులు భవన నిర్మాణ అనుబంధ రంగాల్లో పనిచేస్తుంటే, వెల్ఫేర్ బోర్డులో 18 వేల మంది సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల క్లైములు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ బోర్డు ఛైర్మన్ రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ప్రధాన నాయకులతో చర్చించారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డుకి చైర్మన్‌ను నియమించింది కాబట్టి ఓపిక పడితే బోర్డు పునరుద్ధరణ కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ బోర్డు గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్లైములు నమోదు చేస్తున్నారుగానీ నిధులు విడుదల చేయడం లేదని అందుకే పోరుబాట పట్టామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించే రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కృష్ణాజిల్లా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజనాల సురేష్, కంచర్లపల్లి వేణుగోపాలరావు కార్మికులను కోరారు.

కార్మికులను ఆదుకోవాలి : జొన్నలగడ్డ తేజ

చదువుకున్నా సరైన ఉద్యోగం లేక కుటుంబ పోషణ కోసం భవన నిర్మాణ అనుబంధ రంగాల్లో కార్మికుడిగా పనిచేయాల్సి వస్తుంది. రెండేళ్లగా బోర్డు తీసే పని చేస్తున్నాను. నెలలో సగం రోజులు కూడా పని దొరకడం లేదు. భవన నిర్మాణ రంగం అనుబంధ కార్మికుడిగా గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకుంటే లేబర్ ఆఫీసు వాళ్లు ఇంకా ఇవ్వలేదు. కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

పని భద్రత కరువు : దామెర్ల వీరరాఘవులు

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు. ఒకరి కష్టంతో ఇంటిల్లిపాది లాక్కు రావాల్సిన దుస్థితి. ప్రతిరోజు పని దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. పని ప్రదేశాల్లో భద్రత లేక ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తుంది. ఇటీవల గోడ కూలి కార్మికుడు చనిపోతే పట్టించుకునే నాథుడు లేడు. ప్రభుత్వపరంగా కార్మికులకు నష్టపరిహారం చెల్లించేలాగా చూడాలి.

నీటి కాలుష్యమే కారణమా?

నాలుగు రోజులవుతున్నా నివేదిక బహిర్గతం చేయని అధికారులు

ప్రజాశక్తి-విజయవాడ: నీటి కాలుష్యం వల్లే అతిసార సోకినట్లు ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావుతో పాటు ఆ పార్టీ నేతలు న్యూ ఆర్ఆర్‌పేటలో శనివారం పర్యటించిన సందర్భంలో బాధితులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. కేర్ అండ్ షేర్ పాఠశాలలోని ఉచిత వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను, అలాగే డివిజన్‌లోని ఇంటింటికీ...వీధి వీధికి తిరుగుతున్న సందర్భంలో పైపుల్లో ఎటువంటి నీరు వస్తుందో...వారు పడుతున్న అవస్థలను సిపిఎం బృందానికి వివరించారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం అలస్యంగా మేల్కొని అతిసారకు కారణం ఇప్పుడే స్పష్టం చేయలేమని, ఫుడ్‌పాయిజన్ మరేదయినా కావచ్చుననే రీతిలో అసలు విషయాన్ని దాటవేసే వైఖరితో మాట్లాడుతున్నారంటూ బాధితులు మండిపడుతున్నారు. న్యూ ఆర్ఆర్‌పేటలోని ప్రజలకు పైపుల ద్వారా సరఫరా చేస్తున్న నీటి నమూనాలను టెస్టింగ్ కోసం గుంటూరు, హైదరాబాద్ లాంటి నగరాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు ల్యాబ్‌లకు పంపించి నాలుగైదు రోజులయినా నేటికీ ఆ రిపోర్టులను జిల్లా అధికారులు వెల్లడించకపోవడం పట్ల కూడా పలు అనుమానాలకు తావిస్తున్నట్లుగా ఉంది. ఏ ల్యాబ్ నుంచి అయినా టెస్టింగ్ రిపోర్టు 48 గంటల్లో తప్పని సరిగా వస్తుందని ఆయా శాఖల అధికారులు బహాటంగానే వెల్లడిస్తూనే ఆ గడువు ముగిసినా వాటర్ టెస్టింగ్ రిపోర్టులను బహిర్గతం చేయకపోవడంలో దాగి ఉన్న మర్మం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు వస్తుందని, ఎర్రగా, బురద, వాసనతో కూడి ఉంటుందని ప్రజలు ఎప్పటి నుంచో చెప్తూనే వస్తున్నారు. గత ఏడాది సంభవించిన బుడమేరు వరదల సందర్భంగా ఎక్కడికక్కడ మంచినీటి పైప్‌లైన్లు దెబ్బతినడంతో పాటు డ్రయినేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తం అయింది. బుడమేరు వరద పోయిన తరువాత ఎక్కడెక్కడ ఏమేమి నష్టం జరిగిందని వియంసి ఇంజినీరింగ్ అధికారులు చేసిన సర్వేలో మంచినీటి పైప్‌లైన్లు, డ్రయిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఉన్నత స్థాయి అధికారులకు సమగ్ర నివేదిక అందజేసినా నేటికీ ఆ నివేదికలో పొందుపరిచిన దాని ప్రకారం ఎటువంటి మరమ్మతు పనులు జరగలేదని స్వయంగా వియంసి అధికారుల రికార్డులు విధితం చేస్తున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంక్‌లను క్లీనింగ్ చేయకపోవడం, పైప్‌లైన్లు దెబ్బతినడం, అంతేగాక ఈ పైప్‌లైన్ల మరమ్మతు పనులు, పర్యవేక్షించాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నామ్‌కే వాస్తేగా అన్నట్లు సిబ్బంది ఉన్నట్లు వియంసి ఇంజినీరింగ్ అధికారులు నివేదికలు విధితం చేస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రస్తుతం డయేరియా సోకి వందల మంది తీవ్ర అస్వస్థతకు లోనైన తరువాత ...ఇప్పుడు లీకులు పరిశీలన, మరమ్మతు పనులు చేసే పనిలో అధికారులు నిమగ్నమవ్వడం గమనార్హం.

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

E.P. No.6/2024 EJCJ O.S. No. 328/2021

సత్య మణికంఠ సాయి చరణ్ ... డిక్రీ హోల్డర్
వర్సెస్
గూడూరు రవీంద్రరెడ్డి .... జడ్జిమెంటు డెబ్టార్

నోటీసు

టు,
గూడూరు రవీంద్రరెడ్డి, తండ్రి : సత్యనారాయణరెడ్డి, డోర్ నెం. 4-13ఎ, రెడ్డి బజారు, వెల్వడం గ్రామం, మైలవరం మండలం, క్రిష్ణాజిల్లా. ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా.

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా మీకు శ్రీ కోర్టువారు పలుమార్లు నోటీసులు U/o 21 Rule 54 (1) CPC నోటీసులు పంపినను మీకు జారీ కాలేదు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం వాయిదా తేది 17-09-2025న వేసివున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10-30 గం.లకు హాజరై మీకున్న ఆక్షేపణలను మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై తెలుపుకొన వచ్చును. లేనిచో మీ పరోక్షమున ఏమియును లేదని తీర్మానించెదరు.

ఎల్.గణపతి
డిక్రీహోల్డరు తరపు న్యాయవాది,
సూళ్ళూరుపేట, తిరుపతి జిల్లా.

IN THE COURT OF THIRD ADDL JUNIOR CIVIL JUDGE VIJAYAWADA

E.P.No.350 / 2022 IN O.S.No.161/2017

Between:
Arja Giridhar Rao, S/o Late Kutumba Rao, Dr.No.54-15-1, Ring Road, Vijayawada-8, NTR District .... Petitioner / D.H.R
And
Garlapati Naga Venkata Srinivasa Rao, S/o Samba Siva Rao, Indian, Hindu, aged about 48 years, Business, Dhana Lakshmi Enterprises, Door No.28-19-10, Janda Street, Arundalpet, Vijayawada-520002 .... Respondent/J.D.R

In the above mentioned proceedings the Hon'ble Court was pleased to order Rul2 37 Notices to the Respondent / J.D.R by way of publication as substitute of service. The above matter is stands posted to 07-10-2025. Hence the Respondent / J.D.R is requested to attend before the above-mentioned Hon'ble Court on 07-10-2025 at 10.30 A.M either in person or through his advocate failing which the matter will be decided exparte.

(By Order of the Court)

Ch.Manmadha Rao,
Smt.Ch.Nirmalatha,
Advocates,
Vijayawada **Labbipeta, Vijayawada-10**
Dt.11-09-2025 **Cell.9885443339**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),
విజయవాడ, లొకేటెడ్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం. 54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **అప్లికెంట్: శ్రీ మోపిదేవి నాగ ఫణీంద్ర కుమార్,** తండ్రి: శ్రీ ఎం. రామారావు, డి.నెం. 15/323-14-1, దేవునిచెరువు, మాచవరం, మచిలీపట్నం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. **సహ-అప్లికెంట్: శ్రీమతి బలగం శ్రీ విజయ భార్గవి,** భర్త: శ్రీ ఎం.ఎన్. ఫణీంద్ర కుమార్, డి.నెం. 15/323-14-1, దేవునిచెరువు, మాచవరం, మచిలీపట్నం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **ది. 02.07.2025 నాటికి రూ. 55,67,098.35 (అక్షరాలా యాభై ఐదు లక్షల అరవై ఏడు వేల తొంభై ఎనిమిది రూపాయల ముప్పై ఐదు పైసలు మాత్రమే)** నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 02.07.2025** న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **తేదీ. 12-09-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **ది. 02.07.2025 నాటికి రూ. 55,67,098.35 (అక్షరాలా యాభై ఐదు లక్షల అరవై ఏడు వేల తొంభై ఎనిమిది రూపాయల ముప్పై ఐదు పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఐటమ్ నెం 1: కృష్ణాజిల్లా, మచిలీపట్నం, మాచవరం, దేవునిచెరువు, మున్సిపల్ వార్డ్ నెం. 15, డోర్ నెం. 15/323-14, ప్రస్తుతం 15/323-14-1 వద్ద ఉన్న 237 చదరపు గజాల నివాస భూమి మరియు ఆర్‌సిసి రూఫ్‌డ్ బిల్డింగ్ శ్రీ మోపిదేవి నాగ ఫణీంద్ర కుమార్, తండ్రి: శ్రీ ఎం. రామారావు గారికి చెందినది. **హద్దులు: తూర్పు:** అన్నం మౌనిక గారి స్థలం - 40 అడుగులు, **పడమర:** మహ్మద్ ఫైజాన్ గారి ఇంటి స్థలం - 36 అడుగులు, **ఉత్తరం:** 15 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి - 56 అడుగులు, **దక్షిణం:** వీరంకి బేబి సరోజిని మరియు పరింకాయల శ్రీనివాసరావు మరియు ఇతరుల స్థలం - 54 అడుగులు.

ఐటమ్ నెం 2: కృష్ణాజిల్లా, మచిలీపట్నం, మాచవరం, దేవునిచెరువు, మున్సిపల్ వార్డ్ నెం. 15, డోర్ నెం. 15/323-14-1 వద్ద ఉన్న 29.61 చదరపు గజాల నివాస భూమి మరియు ఆర్‌సిసి రూఫ్‌డ్ బిల్డింగ్ శ్రీ మోపిదేవి నాగ ఫణీంద్ర కుమార్, తండ్రి: శ్రీ ఎం. రామారావు గారికి చెందినది. **హద్దులు: తూర్పు:** కొత్తప్రోలు రమేష్ గారు ఇతరులకు అమ్మిన స్థలం - 41 అడుగులు, **పడమర:** బి పార్టీ ఆంద్రాజు శ్రీనివాసరావు గారి ఇల్లు, స్థలం మరియు కాంపౌండ్ గోడ - 41 అడుగులు, **ఉత్తరం:** మున్సిపల్ సిమెంట్ రోడ్డు - 6 అడుగులు, **దక్షిణం:** మోపిదేవి నాగ ఫణీంద్ర కుమార్ గారి స్థలం - 7 అడుగులు.

తేది: 12.09.2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

కార్మికుల హక్కులు హరిస్తున్న

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు కృష్ణాజిల్లా మహాసభల ప్రారంభంలో రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కులు పణంగా పెట్టి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మచిలీపట్నంలో జరిగిన సిఐటియు జిల్లా మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల ప్రయోజనాలను హరిస్తున్న లేబర్ కోడ్‌లు, దేశవ్యాప్తంగా రైతుల పాలిటి యమ పాసింగా మారిన నల్లచట్టాలు, హిందూ ముస్లింల సమైక్యతను దెబ్బతీసే విధంగా పెహల్గామ్ ఉగ్రదాడులను కూడా రాజకీయ లబ్ధి కోసం వాడు కోవాలని చూస్తున్న బిజెపి ఉచ్చులో ప్రాంతీయ పార్టీలు చిక్కుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం, జనసేన పక్షాలకు తోడు జగన్ కూడా బిజెపికి తొత్తుల పని చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజల్లో బిజెపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని, జూలై 9 సమ్మె విజయవంతం కావడానికి కూడా అదే కారణం అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31- జనవరి 4 తేదీలలో విశాఖపట్నంలో జరిగే ఆల్ ఇండియా మహాసభల్లో కార్మికుల ప్రయోజనాల కోసం పలు తీర్మానాలు చర్చించి ఆమోదిస్తామన్నారు. ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.

కాగా మందుగా కోడూరు మండలానికి చెందిన అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకురాలు విక్టోరియా సిఐటియు జండా ఎగరేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. యుటిఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి జి కిషోర్ కుమార్, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ రావి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్లెం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై నరసింహారావు, ఎం పోల్ నాయుడు మహమ్మద్ కరీముల్లా, ఓడుగు గంగాధర్ రావు, జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, పౌర సంఘం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం మండల కన్వీనర్ చిరువోలు జయరావు, సహాయ కార్యదర్శి టి చంద్రపాల్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగత రమాదేవి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పర్చూరు ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏవి నాగేశ్వరరావు

జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి గూడూరు/మోపిదేవి : గూడూరు మండలం తరకటూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న గూడూరు పోలీసులు క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రికి తరలించారు. గూడూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన సమాచారం ప్రకారం మచిలీపట్నం నుండి బైక్‌పై ముగ్గురు విజయవాడ వెళుతుండగా తరకటూరు దగ్గర ఇటుక రాళ్లతో వెళుతున్న ట్రాక్టరు వెనుకగా గుద్దడంతో చందర్లపాడు మండలం వెన్నవెల్లి గ్రామానికి చెందిన పరిమి ఆదామ్‌బాబు ఘటనలో చనిపోయారు. అలాగే పెనమలూరు అంబటిపురి కి చెందిన కొమ్మువరపు షారోన్ మచిలీపట్నం హాస్పిటల్ కి తీసుకు వెళ్లిన తర్వాత చనిపోయాడు. అలాగే విజయవాడ తాడిగడపకు చెందిన వికోట కౌశిక్ స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సత్యనారాయణ తెలిపారు.

మృతిచెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

మోపిదేవి మండలం కప్తానుపాలెం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతిచెందారు. సేకరించిన వివరాల మేరకు బాపట్ల జిల్లా కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ కొక్కిలిగడ్డ జక్రయ్య బాబు (55 సంవత్సరాలు) బైకుపై చల్లపల్లి వైపు నుండి వెళుతుండగా రేపల్లె వైపు నుండి వస్తున్న కారు రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని తప్పించబోయి జక్రయ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పాస్టర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మోపిదేవి ఎస్సై వైవివి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం పోరంకి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ముగ్గురు లబ్ధిదారుల కుటుంబసభ్యులకు మంజూరైన ఎల్ఒసి అనుమతి కాపీలను టిడిపి నాయకులు బోడే సురేష్, మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకర్,కోయ ఆనంద్ ప్రసాద్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 876 మంది పేద కుటుం బాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.8, 09,64,231 రూపాయలను ఎంఎల్ఎ బోడే ప్రసాద్ అందించారన్నారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మానవతా స్వచ్ఛంద సంస్థ పదిమంది ఉపాధ్యాయులను ఉన్నతంగా సత్కరించి గౌరవించింది. శనివారం విశ్వభారతి నవోదయ, సైనిక్ కోచింగ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సన్మాన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరరావు (గొల్లనపల్లి హైస్కూల్ హెచ్ ఎం), జి.వి. రవిబాబు (గన్నవరం బాలుర హైస్కూల్), డి. రాజరాజేశ్వరి (వేలేరు హైస్కూల్), డి. రాజారత్నం (సీతారామపురం ఎంపీపీ ఎస్), డి. కుమార్ (దావాజిగూడెం హైస్కూల్), డి. జ్యానేష్ (వెదురుపావులూరు ఎంపీపీఎస్), కేవీ పద్మావతి (గన్నవరం చింతలపేట ఎంపీపీఎస్), ఆర్. రత్నకుమారి (దావాజిగూడెం ఎంపీపీఎస్), టి. సుబ్బలక్ష్మీ (గన్నవరం బాలికల హైస్కూల్), సి.రాధ (వీరపనేనిగూడెం హైస్కూల్)లకు శాలువాలు కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. మానవత ఛైర్మన్ మడుపల్లి బాలకష్ణ మూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, మానవత విద్యా విభాగపు డైరెక్టర్ సయ్యద్ లాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.వీ. కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత ఎ.వివరలక్ష్మిని ఘనంగా శనివారం ఘనంగా సత్కరించారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న యుటిఎఫ్ నాయకురాలు ఎ.వి వరలక్ష్మి ఆ పాఠశాల తరపున శాలువాలతో శనివారం ఘనంగా సత్కరించారు. నిరంతరం విద్యార్థుల ఉన్నత విద్యను బోధించేందుకు ఆమె ఎంతగానో కృషి చేస్తారని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరమ్మ, వై నాగలక్ష్మి, లక్ష్మి కుమా రి, సి ఆర్ పి ఉమారాణి , విద్యార్థులు పాల్గొన్నారు

సిలికానాంధ్ర వైద్యసేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఘంటసాల : కూచిపూడిలో ఉన్న రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవి వారు అందిస్తున్న వైద్యసేవలు అభినందనీయమని శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ ఛైర్మన్ బండి పరాత్పరరావు పేర్కొన్నారు. ఘంటసాల లోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని భాను ప్రకాష్, పరాత్పరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ వైద్యశిబిరంలో స్త్రీలకు ప్రసూతి విభాగం, జనరల్ విభాగం, దంత, కంటి విభాగాలను 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యాలయం ఆడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుడు కుమార్, హాస్పటల్ మేనేజర్ నిమ్మగడ్డ సత్యప్రకాష్, పీఆర్వో తాతా తిరు గణేష్, షామియానా బాషా పాల్గొన్నారు.

భార్యపై దాడి

ప్రజాశక్తి- నందివాడ : కుటుంబ కలహాలతో భర్త భార్యపై హత్యాయత్నం చేసిన ఘటన నందివాడ మండలం లోని పోలాశి వారి పాలెంలో శనివారం జరిగింది. వివరాల ప్రకారం మండలం లోని పోలాశివా రిపాలెం గ్రామానికి చెందిన సాలి సాయిబాబు, సాలి దివ్య భార్యభర్తలు. కుటుంబ గొడవల వల్ల దివ్య కుదరవల్లి గ్రామంలో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో కోపం పెంచుకున్న సాయిబాబు శుక్రవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటలకి దివ్య ఇంటికి వెళ్లి తనతో రావాలని అడగ్గా నిరాకరించడంతో తనతో తెచ్చుకున్న కత్తితో గాయపరిచాడు. ఈ దాడిలో అతని అత్తమామలు లంకపల్లి రత్నకుమారి, లంకపల్లి నీలాంబరంలకు కూడా గాయాలయ్యాయి. గాయాలైన సాలి దివ్య గుడివాడ గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. నందివాడ ఎస్సై కె. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతిపై గాయాలు

ఐదో రోజూ కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఎలుకపాడులో అసైన్మెంట్ భూమిని ఆన్లైన్ చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం బాధితులు 5వ రోజు జోరువానలోనూ దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, కోటేశు, విశ్వేశ్వరరావు, ప్రసంగి, మరియమ్మ, మేరిగ్రేషు, సుగుణ, సుబ్బమ్మ, దావీదు, శిఖామణి పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కైకలూరు నియోజకవర్గం, దానాగూడెంలో దళిత యువకులపై అగ్రవర్ణాల దాడి ఘటనను గుడ్లవల్లేరు మండల దళిత సంఘాలు శనివారం నిరసించాయి. ఈ సందర్భంగా దళిత నాయకుల ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, గజమాల వేసారు. అనంతరం దళిత యువ నాయకులు దాసి సత్యనారాయణ, మాలమహానాడు నాయకులు కోటే రామ్ నాథ్, సీనియర్ దళిత నాయకులు వారా పాపారావులు మాట్లాడుతూ దానాగూడెం యువకులపై కత్తులతో దారుణంగా దాడిచేసి గాయపరచిన వారిలో ప్రధాన కారకుడైన జనసేన నేత కొల్లి బాబీని తక్షణమే అరెస్టు చేయాలని, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. కొల్లి బాబీని అరెస్టు చేయని పక్షంలో దళితులంతా సంఘటితమై భారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం దళిత నాయకులు కైకలూరు దానాగూడెం వెళ్ళి బాధితులను పరామర్శించి, సంఘీభావం తెలిపారు. దళిత నేతలు జక్కుల నెలబాలుడు, పులి ప్రశాంత్, ఈదా కొండయ్య, పెనుమాల రంగారావు, కంభం బ్రహ్మజీ, దాసరి రవి, దారా సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందజేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలంలో యూరియా కొరత లేదని ప్రస్తుతం పిఎసిఎస్ ల వద్ద, ప్రైవేట్ దుకాణాల వద్ద యూరియా అందుబాటులో ఉందని కోడూరు మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్ తెలిపారు. శనివారం ప్రైవేట్ దుకాణాలు ద్వారా ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీల ద్వారా దాదాపుగా 1258 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. రైతాంగం అవసరం మేరకు, ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయటం జరుతుందని, ఇంకా రైతాంగానికి ఎవరికైనా అందక పోతే వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

వంట మనిషిపై దాడి

ప్రజాశక్తి-గన్నవరం : మద్యం తాగడం తప్పు..పైగా హాస్టల్లో ఇలాంటి పనులు చేస్తారా.. ఈ విషయాన్ని వార్డెన్‌కు చెబుతానన్న.. వంటమనిషిపై విద్యార్థులు దాడి చేసిన ఘటన గొల్లనపల్లి హైస్కూల్లోని హాస్టల్లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గన్నవరం మండలం గొల్లనపల్లి హైస్కూల్లో ఆవరణలో ప్రభుత్వ హాస్టల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. దానియేలు వార్డెన్ గా ఉన్నారు. గొల్లనపల్లికి చెందిన కాశిమ్మ పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. అయితే కొంతమంది విద్యార్థులు హాస్టల్ భవనంపై కూర్చుని మద్యం తాగుతుండగా వారించగా ఆమెపై దాడి చేశారు. బంధువులు ఆమెను హుటా హుటిన గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలోని సిబ్బంది ఆమెకు ప్రాథమిక చికిత్సలు చేసి ఉన్నత చికిత్స కోసం విజయవాడ తీసుకు వెళ్ళమని చెప్పారు. హాస్టల్ వార్డెన్ సక్రమంగా విధుల్లో ఉండకపోవడం వల్ల విద్యార్థులు దారితప్పుతున్నారని స్థానికులు అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పిబి సిద్ధార్థలో అంతర్జాతీయ ప్రోగ్రామర్ దినోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విజయవాడ పిబి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఫెస్టా డెల్ కోడైస్ పేరుతో శనివారం అంతర్జాతీయ ప్రోగ్రామర్ దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులలో ప్రోగ్రామింగ్ నైపుణ్యాల పెంపునకు కోడ్ క్యాస్కేడ్, ఆల్గో క్వెస్ట్, యూఎన్ఓ కోడ్ తదితర అంశాల్లో తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ ఉదయశ్రీ కొంపల్లి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. సంహిత రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విద్యార్థుల్లో అల్గారిథం, తార్కిక నైపుణ్యాలపెంపు లక్ష్యంగా ప్రోగ్రామింగ్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు.

రణభేరి జాతాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సెప్టెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు జరిగే యుటిఎఫ్ రణభేరి జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస రావు, ఎ సుందరయ్య శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగ్గయ్యపేట నుండి జరిగే ఈ జాతలో పూర్వ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెయస్.యస్ ప్రసాద్ హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ప్రచార జాతా జగ్గయ్యపేట జడ్పీ హైస్కూల్ వద్ద 9 గంటలకు ప్రారంభమై నందిగామ, కంచికచర్ల, మూలపాడు మీదుగా 1.30 గంటలకు ఇబ్రహీంపట్నం చేరుకుంటుందన్నారు. అక్కడి నుండి విజయవాడ సిటీలో గుండా సాగుతూ సాయంత్రానికి కృష్ణా జిల్లా గన్నవరానికి చేరుకుంటుందని తెలిపారు. హైస్కూల్లో, స్థానిక ఎమ్మార్సీ కేంద్రాలు వద్ద ఉపాధ్యాయులను సమీకరించి వారిని ఉద్దేశించి నాయకులు మాట్లాడి ప్రచార జాతా సాగుతూ ఉంటుందని వారు తెలిపారు.

బూడిద కాంట్రాక్ట్ రద్దు చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: బూడిద కాంట్రాక్టును ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో ఎన్‌టిటిపిఎస్ లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పెదర్ల రవి సొసైటీ సభ్యులకు సంఘీభావం తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు పద్ధతిలో బూడిదను కేటాయించడాన్ని నిరసిస్తూ మండలంలోని బూడిద పీడిత గ్రామాల లారీ ఓనర్లు చేస్తున్న ఈ ఉద్యమానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. యూనియన్ అధ్యక్షులు కోయా వెంకటరావు, సెక్రటరీ కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన కాంట్రాక్టులను సత్వరమే రద్దు చేసి బూడిద ఎత్తుకునే అవకాశాన్ని తమకు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సైదులు, గుంటుపల్లి గ్రామ సర్పంచ్ భూక్యా కవిత పాల్గొన్నారు.

కెన్‌స్టార్ వాటర్ హీటర్లు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గృహోపకరణాల ప్రధాన సంస్థ కెన్‌స్టార్ తన కొత్త 5-స్టార్ బిఈఈ రేటింగ్ పొందిన వాటర్ హీటర్ల శ్రేణిని ఆవిష్కరించిందని సంస్థ సిఈఓ సునీల్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి 20 శాతం ఎక్కువ వేడి నీరు, 40 శాతం ఎక్కువ లైఫ్, అలాగే 10 శాతం మెరుగైన హీట్ రిటెన్షన్ను అందిస్తాయని తెలిపారు. ఈ వాటర్ హీటర్లు స్విర్ల్ హీట్ టెక్నాలజీ, జర్మన్ బ్లూ సఫైర్ కోటింగ్, హై-డెన్సిటీ పీయూఎఫ్ ఇన్సులేషన్తో రూపొందించబడ్డాయని తెలిపారు. 3 లీటర్ల నుండి వంద లీటర్ల వరకు సామర్థ్యంలో లభించే ఈ కొత్త రేంజ్‌లో స్టోరేజ్, ఇన్‌స్టంట్, ట్యాంక్‌లెస్, గ్యాస్ హీటర్లు, అలాగే ఇమర్షన్ రాడ్లు ఉన్నాయని తెలిపారు.

ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టి

- **కలెక్టర్ జి.లక్ష్మీశ**

ప్రజాశక్తి-విజయవాడ

ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరమని.. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్దాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరగకుండా కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ప్రతి దేవాలయంలో వివాహానికి అర్హత వయసు, వయసు ధ్రువీకరణపత్రాలు, చట్ట నియమ నిబంధనలు తెలియజేసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబరుతో పాటు చైల్డ్ హెల్ప్ లైన్ 1098కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాల్లో ప్రదర్శించాల్సిన వివరాలతో కూడిన నమూనా పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, ఎండోమెంట్ ఏసీ షణ్ముఖ నటరాజన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అతిసార అదుపులో ప్రభుత్వం విఫలం

- **సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని న్యూ రాజరాజేశ్వరీపేటలో గత కొద్ది రోజులగా అతిసార విజంభిస్తున్నా ఇప్పటివరకు అధికార యంత్రాంగం కారణాలు గుర్తించకపోవడం, పరీక్షల పేరుతో కాలయాపన చేస్తుండడం కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని, డయేరియా ప్రబలి ప్రజలు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినాలేదని, డయేరియాను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ సభ్యులు, ఏపిసీసీ పూర్వ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియాను అదుపు చేసే చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డమాండ్ చేశారు. కలుషిత నీరే కారణమని స్థానికుల గగ్గోలు పెడుతున్నా వఅధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే వైద్య బృందాలను పెంచాలని, మృతుల కుటుంబాలకు సాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుచున్న నిత్యాన్నదాన పథకమునకు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన యాదగిరి కష్ణ చైతన్య రూ.10116, ఖమ్మం పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు, వాణిశ్రీ దంపతులు రూ.10116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

కొండరాళ్లను తొలగించాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు క్వారీ కొండ ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన కొండరాళ్ల తొలగింపుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ బి సత్యబాబు విఎంసి అధికారులను కోరారు. శుక్రవారం రాత్రి క్వారీ కొండ ప్రాంతంలో నివసించే తన్నీరు శ్రీనివాసరావు డాబా పై కొండ రాళ్లు దొర్లి పడిన నేపథ్యంలో కార్పొరేటర్ స్థానికంగా పర్యటించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లు దొర్లి పడిన సమయంలో డాబాపై ఎవరూ లేనందున పెను ప్రమాదం తప్పిందన్నారు. మరలా వర్షాలు కురుస్తున్న క్రమంలో ముందస్తు చర్యలలో భాగంగా క్వారీ ప్రాంతంలో ఐరన్ రివిటింగ్ మెస్ ఏర్పాటు చేయాలని కోరారు. జారిపడ్డ కొండ రాళ్ళు, మట్టిని వెంటనే తొలగించాలని కోరారు. ఈ సంఘటన ప్రాంతాన్ని కార్పొరేటర్ బి సత్యబాబు తోకలిసి విఎంసి ఇన్‌స్పెక్టర్ రవిశంకర్,.ప్లానింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రెటరీ పరిశీలించారు.

భవానీ ఐలాండ్, బరం పార్క్ ప్రైవేటీకరణ ఆపాలి

బోయి సత్యబాబు

ప్రజా శక్తి - విజయవాడ సిటీ

భవానీ ఐలాండ్, బరం పార్క్ ప్రైవేటీకరణ ఆపాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపేట మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్లో శనివారం మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరానికి ఉన్న ఏకైక పర్యాట కేంద్రం భవాని ఐలాండ్, బరంపురం పార్క్, పున్నమి ఘాట్‌ను టిడిపి కూటమి ప్రభుత్వం ఏపీ టూరిజం ల్యాండ్ అలాట్మెంట్ పాలసీ ఆపరేషన్ మెయింటినెన్స్ పేరుతో ప్రైవేటు వారికి దారాదత్తం చేయడం ప్రజాధనాన్ని లూటీ చేయడమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణ విధానాలు ప్రారంభించినప్పుడు కమ్యూనిస్టు పార్టీలతో కలిసి వాటిని తెలుగుదేశం వ్యతిరేకించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ ద్వారా భవానీ ద్వీపం, బరం పార్కును నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేదల పెళ్లిళ్లకు సహాయం చేయాల్సిన ప్రభుత్వం పంజా సెంటర్‌లోని షా జాహూర్ ముసాఫిర్ ఖానా కాంట్రాక్టుకు కట్టబెట్టడం ద్వారా పేదవారి పెళ్లిలపై భారం పడుతుందన్నారు. వెంటనే ఈ ప్రక్రియను నిలపుదల చేసి పేద ముస్లిం మైనార్టీలకు ఉచితంగా మూసాఫిర్ ఖానా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె సూరిబాబు, నగర కమిటీ సభ్యులు ఎస్‌డి కరీముల్లా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బోయి సత్యబాబు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కేతనకొండ గ్రామంలో నిమ్రా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గ్రామాలలో మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ఉండటం వల్ల ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 220 మందికి ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ వంటి పరిక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పత్రి లేపాక్షి రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి గోపాలరావు, పార్టీ సీనియర్ నాయకులు పత్రి చలపతిరావు నిమ్రా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శంకర్, హాస్పిటల్ ఏవో ఖాజా పఠాన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి- నందిగామ

జాతీయ లోక్ అదాలత్ లో 494 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించి బాధితులకు రూ.3,72,12,387ల పరిహారం అందజేసినట్లు నందిగామ 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి పి శ్రీనివాసరావు తెలిపారు. నందిగామలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కంచికచర్ల మండలం పేరకలపాడు చెందిన చెరుకూరి మాదురి, తాడపనేని నాగ దుర్గా శ్రీనివాస మధ్య నెలకొన్న భూవివాదంలో రూ. 2.20 కోట్లకు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం చేశారు. జడ్జి శ్రీనివాస్ చేతులమీదుగా అవార్డు కాపీ అందజేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో అతిపెద్ద కేసును జిల్లా జడ్జి సెషన్స్ జడ్జి పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం అందజేయడం పట్ల కక్షిదారులు హర్షం వ్యక్తం చేశారు. పలు సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం చేసి కక్షిదారులకు సమన్యాయం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎం జడ్జి షేక్ రియాజ్, న్యాయవాదులు షేక్ కరీముల్లా, దర్సి అర్జున, పాల్గొన్నారు.

విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి-విస్సన్నపేట

తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు శనివారం విస్సన్నపేటలో పర్యటించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో దాతల సహకారంతో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. కొండపర్వ, తాతకుంట్ల గ్రామాల్లో పర్యటించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే ప్రక్రియ ప్రారంభమవుతున్న తరుణంలో గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలలో చేయవలసిన అభివద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు, డాక్టర్ నందమూరి తిరుపతి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్ వెంకటేశ్వరరావు, తెల్లదేవరపల్లి సొసైటీ చైర్మన్ వీరమాచినేని కష్ణ ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు కోలేటి రంగారావు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
ఆదివారం 14 సెప్టెంబరు 2025

చికిత్సపొందుతున్న రోగులు

ఆర్ఆర్ పేటలో సిపిఎం విస్తృత సేవలు

- రోగులను వైద్య శిబిరానికి తరలించిన నేతలు
- సమస్యలను మంత్రి, జెసి దృష్టికి తీసుకెళ్లిన సిహెచ్.బాబురావు
- అతిసారకు ప్రభుత్వం, విఎంసినే బాధ్యత వహించాలని డిమాండ్
- బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి

సమస్యను అధికారులకు వివరిస్తున్న బాబురావు

మృతుడు నరసింహా మృతదేహం వద్ద మాట్లాడుతున్న బాబురావు

ఆటోలో ఆస్పత్రికి వెళ్తున్న రోగులతో మాట్లాడుతున్న బాబురావు

ఓ కుటుంబంలో ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న బాబురావు

స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : న్యూ రాజరాజేశ్వరి పేటలో అతిసార ప్రబలడానికి ప్రభుత్వం, విజయవాడ నగర పాలక సంస్థే బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో బాబురావు, సిపిఎం సెంట్రల్ సిటీ నేతలు బి రమణ రావు, కే దుర్గారావు, ప్రవీణ్ తదితరులు శనివారం విస్తతంగా పర్యటించారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. రోగులను వైద్య కేంద్రాలకు తరలించారు. వైద్య శిబిరంలోని మరుగుదొడ్లను నీటితో శుభ్రం చేశారు. పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి కాలుష్యం తదితర సమస్యలను గమనించి సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ మంత్రి నారాయణకు, జాయింట్ కలెక్టర్‌కు అతిసారతో వచ్చిన ఇబ్బందులను వివరించారు. అతిసారతో శుక్రవారం మరణించిన నరసింహ మృతదేహాన్ని సందర్శించారు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతోపాటు మంత్రి నారాయణను కలిసి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ తిరిగి ఇళ్లలోనే చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. మరికొందరిని ఆసుపత్రులకు తరలించారు. సిపిఎం కార్యకర్తలు విస్తతంగా సేవలందించారు. ప్రజలకు భరోసా ఇచ్చి వారి సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిహెచ్.బాబురావు మాట్లాడుతూ తక్షణమే అతిసారకు కారణాలు నిర్ధారించాలని కోరారు. సమగ్ర విచారణ జరిపి కలుషిత నీటి సరఫరాకు బాధ్యులను గుర్తించాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలతో చెలగాట మాడటం తగదన్నారు. అరకొర వైద్య సదుపాయాలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందన్నారు. అధికారపక్ష ప్రజాప్రతినిధులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారని విమర్శించారు. మంత్రులు వచ్చి వెళుతున్నారని, కానీ నిర్దిష్ట చర్యలు చేపట్టడంలేదని అన్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ఏడాది సంభవించిన బుడమేరు వరదల్లో మంచినీటి సరఫరా లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, భూగర్భ డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. దీంతో ప్రజారోగ్యం మరింత క్షీణచిందన్నారు. ఈ ప్రాంతంలో ఐదు వేల మంచినీటి కుళాయి కనెక్షన్లు ఉండగా, ముగ్గురే నీటి సరఫరా సిబ్బంది ఉన్నారని అన్నారు. ఇటు విసిఎంలో పాలకపక్షంగా ఉన్న వైసిపి, అటు కూటమి ప్రభుత్వం ప్రజలను బలి పశువులను చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వేగంగా స్పందించాలని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి ఖర్చుల ప్రభుత్వమే భరించాలని, అందరికీ పది రోజులపాటు ఆహారం పంపిణీ చేయాలని, అస్వస్థతకు గురైన వారికి ఉపాధి లేనందున వారికి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, అధికారులు ముందస్తు జాగ్రత్త పేరుతో అన్ని దుకాణాలు మూయించారని, అల్పాహారం, టీ కూడా ప్రజలకు అందుబాటులో లేదని, కొన్నిచోట్ల కిరాణా సరుకులు, కూరగాయల అమ్మే దుకాణాలను మూయించటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అయితే ఈ ప్రాంతంలోని మద్యం దుకాణాలు మాత్రం తెలిచే ఉంటున్నాయన్నారు. ఈ పర్యటనలో సిపిఎం నేతలు ఎం.బాబురావు, సిహెచ్ శ్రీనివాస్, వై సుబ్బారావు, నిజాముద్దీన్, పీర్ సాహెబ్, టి శ్రీనివాస్, ఎంవి రమణ, పతివాడ ప్రసాద్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

- కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : న్యూ రాజరాజేశ్వరిపేటలో ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ అందిస్తున్నామని, ప్రజలు కూడా అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. న్యూ జీజీహెచ్‌ను సందర్శించి డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. భయపడాల్సిన పనిలేదంటూ భరోసా కల్పించారు. అనంతరం ఆర్ఆర్ పేటలో పర్యటించి ప్రజలకు స్వయంగా డయేరియాపై అవగాహన కల్పించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తతతో పనిచేస్తోందని అన్నారు.

అతిసార నివారణకు అవగాహన

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ : అతిసారా నివారణకు విస్తతంగా అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం వివిధ శాఖాధిపతులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు, నీరసం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని, దగ్గరలోని ప్రథమ చికిత్స కేంద్రంలో సంప్రదించాలని వివరించాలన్నారు. అతిసారా నివారణకు శుభ్రమైన కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని అన్నారు. సందేహాలు లేదా సమాచారం లేదా సహాయం కోసం ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూమ్ 9154970454 నంబరులో సంప్రదించాలని కోరారు.

మేయర్ పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శనివారం కొత్త రాజరాజేశ్వరి పేటలో పర్యటించారు. నీటి సరఫరా, అతిసార కేసులు, బాధితుల పరిస్థితిని తెలుసుకున్నారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర, డిఎంఒహెచ్ డాక్టర్ సుహాసినీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అతిసార నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విఎంసి ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శైలజా రెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

110 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-మైలవరం

లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జాస్తివెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలలో రెండవ, నాలుగవ శనివారం ఉచిత కంటి శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు సిహెచ్ నాగభూషణం, జెడ్ సి శ్రీధర్, లయన్స్ నెంబర్లు ఏ చంద్రశేఖర్, కే శ్రీనివాస్ రావు, బాలాజీ మాస్టర్, వాసన ఐ కేర్ కంటి వైద్యులు వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

కూతురిని కడతేర్చిన తండ్రి అరెస్ట్

ప్రజాశక్తి-మైలవరం

కన్న కూతురిని చంపిన కేసులో తండ్రిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న చిందే బాజీ, నాగమ్మ దంపతులు. వీరికి ఐదుగురు కుమార్తెలు. వీరిలో ఇద్దరికీ వివాహం కాగా, ముగ్గురు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. బాజీకి మైలవరానికి చెందిన నాగేంద్రమ్మను మరో వివాహం చేసుకున్నారు. వీరికి గాయత్రి (14) అనే కుమార్తె ఉంది. బాజీ అతని చిన్న భార్య నాగేంద్రమ్మ గంజాయి అమ్ముతూ ఈ ఏడాది మే నెలలో మైలవరం పోలీసులకు పట్టుపబడి జైలుకెళ్లారు. జూలైలో బాజీ బెయిల్‌పై విడుదలవ్వగా.. నాగేంద్రమ్మ నూజివీడు జైలులోనే ఉంది. దీంతో ఆమె కుమార్తె గాయత్రి శాంతినగర్‌లోని బాజీ మొదటి భార్య నాగమ్మతో కలిసి ఉంటుంది. బాజీ నూజివీడు జైలులో ఉండగా రోహిత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. బాజీ జైలు నుంచి వచ్చిన తరువాత రోహిత్‌ని కూడా ఇంటికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో రోహిత్‌తో గాయత్రి చనువుగా ఉండటాన్ని తట్టుకోలేక ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. గాయత్రి శవాన్ని ఆటోలో తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రంలోని మధిర వైరా నదిలో పడేశాడు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురంకు పారిపోయి తలదాచుకున్నాడు. గాయత్రి కనిపించడంలేదని ఆమె పిన్ని పోతర్లంక స్వప్న ఈనెల 3న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న బాజీ నేరం అంగీకరించి పోలీసులకు లొంగిపోయాడు. సిఐ చంద్రశేఖర్ నిందితుడిని మైలవరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

అక్టోబర్ 12, 13 తేదీల్లో కొండపల్లిలో జరుగుతున్న సిఐటియు ఎన్టీఆర్ జిల్లా 12వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి యం.మహేష్, జిల్లా కోశాధికారి ఎం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యులు పి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభ జయప్రదం కోసం ఆహ్వాన సంఘం ఏర్పడిందని తెలిపారు. తొలుత సెప్టెంబర్ 14, 15 తేదీల్లో మహాసభ జరపాలని నిర్ణయించినప్పటికీ ఇంకా కొన్ని అనుబంధ సంఘాల రాష్ట్ర మహాసభలు, వివిధ రంగాల కార్మికులకు సంబంధించిన సమస్యలపై ఆందోళనల నేపథ్యంలో మహాసభను అక్టోబర్‌లో జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. సిఐటియు శ్రేణులు, ఉద్యోగులు, కార్మికులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్

ప్రజాశక్తి-కంచికచర్ల : కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచికచర్లలో సిహెచ్ పుల్లమ్మ అధ్యక్షతన సిఐటియు మండల జనరల్ బాడీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు, విద్యా, వైద్య ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని, అంగన్‌వాడీలు, ఆశాలకు న్యాయం చేస్తామని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, జీవో 21 రద్దు చేస్తామని, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కంచికచర్ల భవిత స్కూల్లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న తాళ్లపల్లి శివను అక్రమంగా తొలగించారని, ఆమెను తిరిగి విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ స్కీం వర్కర్లందర్నీ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు కార్యదర్శి బెజ్జం భూషణం మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కొనసాగించాలని, ప్రమాదాల్లో మరణించిన, సహజ మరణం పొందిన వారికి క్లైమ్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు కంచికచర్ల మండలం కన్వీనర్‌గా బెజ్జం భూషణం, కోకన్వీనర్‌గా సిహెచ్ పుల్లమ్మ, కమిటీ సభ్యులుగా మరో 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్

వికలాంగుడికి స్టాండు అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన కాకరపత్తి సోమేశ్వరరావు భార్య జ్యోతి పుట్టినరోజు సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు సమక్షంలో లింగగూడెం గ్రామానికి చెందిన వికలాంగుడు శ్రీనివాసరరావుకి నడవడానికి స్టాండ్ అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సాయం చేయడానికి సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నవాళ్లు ముందుకు రావాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఐ సి అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండయ్య పాల్గొన్నారు.

టైటిల్ ట్రాన్స్‌ఫర్ మేళాకు 54 అర్జీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణ పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాలతో నిర్వహించిన టైటిల్ ట్రాన్స్ఫర్ మేళాకు 54 అర్జీలు వచ్చాయి. మున్సిపాల్ కమిషనర్ కృష్ణారావు పర్యవేక్షణలో ఆర్‌ఓ త్రినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఈ అర్జీలను స్వీకరించారు.

తిరువూరులో మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్‌అదాలత్ జరిగింది. న్యాయమూర్తి అనూష సమక్షంలో కక్షి దారులు 403 సివిల్, క్రిమినల్ కేసులలో రాజీ పడినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ బడేమియా న్యాయవాదులు మేకల నాగేంద్ర ప్రసాద్, అత్త లూరి శ్రీనివాసరావు, నాగుబండి రామకష్ణ, కోట జమలయ్య, రాజేంద్రప్రసాద్, ఏం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు :తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వద్దులకు ఆర్థిక సాయం అందించారు. సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి 30 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఆర్థిక సహాయాన్ని పూర్వపు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ అందజేశారు. ఈ సందర్భంగా శౌరి మాట్లాడుతూ జర్మనీ నుంచి మిస్సేరోరా సంస్థ సౌజన్యంతో వయోవృద్ధులకు మందుల ఖర్చుల నిమిత్తం ప్రతినెల ఈ ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, కొంగల రవి బాబు, ఘంటసాల అసోసియేషన్ వాణి రంగారావు, ఎస్‌ఎంఎస్ ట్యూషన్ పాయింట్ పుల్లారావు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ ఉద్యమానికి అండగా ఉంటాం : జోగి రమేష్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మూలపాడులో ఉన్న అక్రమ బూడిద డంప్ యార్డ్ నుండి స్థానిక లారీ యజమానులకు ఉచితంగా లోడింగ్‌కు ఏర్పాటు చేయిస్తామని, లారీ ఓనర్స్ చేస్తున్న ఉద్యమానికి వైసిపి అండగా ఉంటుందని మాజీ మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఇబ్రహీంపట్నంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు నిత్యం కాలుష్య కోరల్లో జీవిస్తున్నారని, రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం బాధిత గ్రామాలను దత్తతు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని, పవిత్ర సంగమం నుండి మూలపాడు, తుమ్మలపాలెం, జూపూడి, ఈలప్రోలు, గుంటుపల్లి, కొండపల్లి మున్సిపాలిటీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. బూడిద టెండర్ ద్వారా వచ్చే సుమారు రూ.150 కోట్లు కాలుష్య ప్రభావిత ప్రాంతానికి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. బూడిద సమస్యపై కలెక్టర్‌ను పోలీస్ కమీషనర్‌ను, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జెన్ కో సంస్థలను కలిసి వివరిస్తామని తెలిపారు.

అందరూ హిందీ నేర్చుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - తిరువూరు

జాతీయ భాష హిందీ నేర్చుకున్న వారికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మాతృభాషతో పాటు జాతీయ భాష హిందీని కూడా నేర్చుకోవడం వల్ల ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తిరువూరు డివిజనల్ ఉపవిద్యాశాఖ అధికారి, తిరువూరు, గంపలగూడెం మండల విద్యాశాఖాధికారి ఏ శ్యాంసుందర్ అన్నారు. శనివారం తిరువూరు సర్వోదయ పాఠశాలలో జరుగుతున్న హిందీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు జరిగే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ రమణమూర్తి, హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

కట్టలేరు వంతెన పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం

ఇటీవల పడుతున్న వర్షాలకు కట్టలేరు వంతెన మళ్లింపు రహదారిపై వరద పొంగుతుంది. దీంతో ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ శనివారం కట్టలేరు వంతెన రహదారిని పరిశీలించారు. ఈ రహదారిపై ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వంతెనకు ఇరువైపులా రాకపోకలు జరుపుకుండా స్టాఫ్ బోర్డులతో పాటు ట్రాక్టర్ ట్రక్కు రహదారికి అడ్డంగా ఏర్పాటు చేయాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు.

కలుషిత ఆహారం తీసుకోవద్దు

– వైద్యాధికారి రేష్మా బేగం

ప్రజాశక్తి - తిరువూరు

కలుషితమైె మంచినీళ్ళు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వంటి ప్రమాదకరమైన జబ్బులు వ్యాపించే అవకాశం ఉందని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం తెలిపారు. డయేరియా వ్యాధి లక్షణాలు – తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు ఆమె శనివారం ఆవాహన కల్పించారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున విష జ్వరాలు, విరోచనాలు, కడుపునొప్పి, వాంతులు వస్తుంటాయని చెప్పారు. డయోరియాను నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు పాటించి వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 201 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-మైలవరం

జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం మైలవరం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో వివిధ కేసులకు సంబంధించి 201 కేసులు పరిష్కారమ య్యాయి. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మైలవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం శైలజ మాట్లాడుతూ రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంకు కేసులు పరిష్కారం చేసుకొని సమయం డబ్బు ఆదా చేసుకోవచ్చుని, ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు సీనియర్ న్యాయవాది శేషగిరిరావు, ప్రభుత్వ న్యాయవాది ఏడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-విస్సన్నపేట

ఇటీవల జరిగిన రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను పొందిన తేరా ప్రసాద్, బత్తుల అనురాధ, వీరకోటిలను శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండల యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ చేసిందే పని ... ఏంటని అడిగే అధికారే లేడు...

పైపు పనులు చేయకుండానే పూడ్చి వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : నా ఇష్టం.. నేను చేసిందే పని.. ఎవరు చెప్పినా వినను.. వేరే శాఖల పనితో నాకు సంబంధం లేదు.. ఇదీ గన్నవరం పట్టణంలో జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల(గుత్తేదారు) కాంట్రాక్టర్ పరిస్థితి. ఐదు నెలలుగా రోడ్డు పనులు కొన..సా..గుతూనే ఉన్నాయి.

రోడ్డు తవ్వే సమయంలో మంచినీటి పైప్ లైన్ మొత్తం ధ్వంసం అయింది. ఆపనులను ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో ఒక కాంట్రాక్టర్ కొత్త పైపులైన్ ఏర్పాటు చేయించారు. అయితే రోడ్డు పనులు చేసేటప్పుడు పెద్ద రోలర్ తో తొక్కించడం వల్ల నేలలో ఉన్న పైప్ లైన్ పలుచోట్ల పగిలిపోయింది. కొన్నిచోట్ల తప్పలా అతుక్కుపోయింది. దీంతో నీరు రాక 100 కుటుంబాలు నెలరోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో పంచాయితీ కార్యదర్శి చెన్నకేశవరావు తవ్వించి పైపైన రిపేర్లు చేయాలని చెప్పారు. తవ్విన తర్వాత పంచాయతీ సిబ్బంది పగిలినచోట్ల రబ్బరు టూబ్ చుట్టారు. రబ్బరు పైపుకు జాయింట్ వేయించడానికి హనుమాన్ జంక్షన్ నుంచి వర్కర్ రావాలని అలా వదిలారు. వర్కర్ రాలేదు. జాయింట్ వేయలేదు. అయితే రోడ్డు కాంట్రాక్టు సిబ్బంది రంగంలోకి వచ్చి మొత్తం పూర్తి చేశారు. రోడ్డు పనులు ఆగిపోయాయని, వెంటనే పూర్తి చేయాలని, పైపులతో మాకు సంబంధం లేదు అంటూ గోతులు పూడి వేశారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ రిపేర్ల గురించి పట్టించుకోలేదని విమర్శ ఉంది. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కూడా నాణ్యత లేకుండా పనులు చేయించారని స్థానికులు విమర్శిస్తున్నారు. అందువల్లే పైపులు పాడైపోయాయని వాదన ఉంది. లక్షల రూపాయలు బిల్లులు మాత్రం పెట్టేసారని అంటున్నారు. పైప్ లైన్ కు రిపేర్లు చేయకుండా రోడ్డు వేసేస్తే ఆ తర్వాత మళ్లీ పైపు లీకైతే కొత్త రోడ్డు పగలగొట్టాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. కోట్ల రూపాయలతో పనులు చేయించే అధికారులు వేరొక శాఖ చేపట్టిన పనులు పూర్తి కాకుండా మిగిలిన పనులు చేయించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. నిజం చెప్పాలంటే శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేదనే విమర్శ ఉంది. పనులన్నీ అస్తవ్యస్తంగా, అడ్డగోలుగా జరుగుతున్నాయని స్థానికులు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. వ్యాపారస్తుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గోతులు తీస్తారు పనులు నెలలు తరబడి చేయరు. వ్యాపారాలు ఏ విధంగా చేసుకోవాలని మండిపడుతున్నారు.

యుటిఎఫ్ తోట్లవల్లూరు మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తోట్లవల్లూరు మండల కౌన్సిల్ ఎన్నికలలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బి హిమకుమారి ఎం. విజయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారని ఎన్నికల అధికారి ఎన్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉయ్యూరు లోని శ్రామిక భవనంలో ఎన్నికలు జరిగాయని అన్నారు. కౌన్సిల్ గౌరవఅధ్యక్షులుగా పిపి అహ్మద్‌బాబు, సహాధ్యక్షులుగా టి వెంకటేశ్వరరావు, సి హెచ్ మైథిలి, కోశాధికారిగా కె రమాదేవి, కార్యదర్శులుగా వి మహాలక్ష్మి, ఎం మురళీకృష్ణ, జి పార్థసారథి, పి అనూష, ఎస్.కె రియాజ్ భాషా, ఏ విష్ణువర్ధన్, జిల్లా కౌన్సిలర్లుగా ఐ విజయలక్ష్మి, పి ఎన్ డి ప్రసాద్, పి కుసుమకుమారి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి పివి రమణ ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలిపారు.

కొండలమ్మ దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి దేవదాయ ధర్మదాయ కమీషనర్ గొల్లపూడి వారి ఉత్తర్వుల ప్రకారం నూతన ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులు శనివారం జారీ అయ్యాయి. చైర్మన్ గా ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు(మోహన్), ధర్మకర్తలుగా తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్లేపల్లి సుగుణశేఖర్, మన్నెం వీర నాగేంద్ర రావు, వడ్డమూడి రవీంద్రబాబు, పెద్దిబోయిన శ్యామలాదేవి, నూతులపాటి లక్ష్మీ పావనిని నియమించినట్లుగా ఆదేశాలు వచ్చాయి.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్టణం మండలంలోని జొన్నలవారిపాలెంకు చెందిన దింటకుర్తి వీరబాబు మృతిచెందగా కానూరు శ్రీ వెంకటేశ్వర పిఎసిఎస్ తరపున కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు (మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్) గోపు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు ప్రతాప్ నరేష్ కుమార్ చేతుల మీదగా వీరబాబు కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు శనివారం అందించారు. సంఘ సెక్రెటరీ అదపా శ్రీనివాస రావు, జొన్నలగడ్డ బాబు రావు, గోపు వెంకట రమణ, దింటకుర్తి బాలాజీ, జొన్నల జోజి, రామకృష్ణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇటీవల అకాల మరణం పొందిన స్థానిక గణేష్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణ కుటుంబ సభ్యులను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం పరామర్శించారు. తొలుత రాధాకృష్ణ చిత్ర పటం వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు.

పోలీసుల సమక్షంలో దాడి అవాస్తవం : బండి రామకృష్ణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కులాల మధ్య చిచ్చు పెడుతున్న పేర్ని నాని తీరు దుర్మార్గమని జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్, ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో బండి రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను దూషించిన ఆర్‌ఎంపి వైద్యుడు గిరిధర్ వ్యాఖ్యలపై వెంటనే స్పందించి పోలీసులకు తెలిపామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసుల సమక్షంలో దాడి జరిగిందనేది వాస్తవం కాదని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గల్లా తిమోతి, జనసేన పార్టీ ఎస్సీ విభాగ నాయకుడు ఉడుముల బుజ్జి పాల్గొన్నారు

గాయత్రి మందిరం కమిటీ అధ్యక్షులుగా కెవిఆర్ కిషోర్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం గాయత్రి మందిరం నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ కె.వి.ఆర్ కిషోర్ నియమితు లయ్యారు. ఈ మేరకు శనివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాదెళ్ల మోహన్, విష్ణుమూర్తి, కడియాల రవి, కంభంపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. కార్యదర్శిగా ఎస్.వి గోపాలకృష్ణ, కోశాధికారిగా జీవి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా ఎస్. రవికుమార్, కే. శివరామకృష్ణ, సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్ శర్మ, సి హెచ్ బిబి శర్మ, న్యాయ సలహాదారుగా జి ఎస్ ఆర్ మూర్తి, గౌరవ సలహాదారులుగా ఎస్. వెంకటేశ్వర శర్మ, జి గోపాలకృష్ణ శర్మ, పిఆర్వోలుగా కే. శ్రీవత్స, వి.వి కృష్ణమోహన్, సభ్యులుగా రాధా కుమారి, శ్రీపాద, మరో 9 మందితో కమిటీ ఏర్పడింది. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన బాలకృష్ణ మూర్తి కాలం చేయడంతో కొద్ది నెలలుగా నిర్వహణ కార్యక్రమాలు ఆగాయి. నూతన కమిటీ మందిర నిర్వహణ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని కిషోర్ తెలిపారు.

21న ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో క్రీడా క్యాలెండర్‌లో ఈనెల 21వ తేదీన ఎన్టీఆర్ మెమోరియల్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్ పురుషులకు, స్త్రీలకు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్యేక క్రీడా క్యాలెండర్ను రూపొందించామన్నారు. ఈనెల 21వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా నిర్వహించే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇప్పటికే క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ పాల్గొన్నారు.

శత జయంతి వేడుకల సందర్భంగా వంతెన సెంటర్ లోని కృష్ణారావు విగ్రహానికి సొసైటీ చైర్మన్ ఎలవర్తి చిన్న బొప్పన భాను పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యస చిట్టిబాబు, రామకోటిపురం కొత్తపేట గ్రామాలకు చెందిన కూటమి నాయకులు మండలి అభిమానులు పాల్గొన్నారు

దివిసీమ అభివృద్ధికి కృష్ణారావు కృషి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ అభివృద్ధికి ఎంవి కృష్ణారావు జీవితాంతం కృషి చేశారని కొత్తపేట పిఎసిఎస్ చైర్మన్ య లవర్తి రాజా నాగ మునేశ్వరరావు (చిన్న) అన్నారు. అవనిగడ్డలో మండలి వెంకటకృష్ణారావు

దోకిపర్రు ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. 8వేల మంది భక్తులు అన్నప్రసాదాల్ని స్వీకరించారన్నారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు.

కంకిపాడులో రోడ్లు జలమయం

ప్రజాశక్తి-కంకిపాడు : శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కంకిపాడు మెయిన్ రోడ్డు, పునాదిపాడు మెయిన్ రోడ్డు పూర్తిగా వర్షపు నీళ్లతో చెరువులను తలపించాయి. పునాదిపాడు బిసి కాలనీ నుండి యూనియన్ బ్యాంక్ వరకు మెయిన్ రోడ్డు కాలువను తలపించింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారు. డ్రైనేజ్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంటుందని, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా 2,619 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాసంస్థ వారి ఉత్తర్వుల ప్రకారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని కోర్టు భవనాల సముదాయంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 4 బెంచీలను ఏర్పాటు చేసి సివిల్(13), క్రిమినల్ (2598), ఇతరాలు(8) కేసులకు గాను మొత్తం రూ. 1,58,03,636లతో 2,619 కేసులు పరిష్కార మయ్యాయి. ఈ సందర్భంగా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి , మండల న్యాయ సేవాధికార కమిటీ జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడ తాయని, కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కారం చేసుకోవాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) ఎస్ వాసుదేవ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి గాయత్రి, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి అరుంధతి, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

కానూరు నెక్స్‌జెన్ స్కూల్లో 'గ్రాండ్ పేరెంట్స్ డే'

ప్రజాశక్తి-కంకిపాడు : కానూరు నెక్స్ జెన్ స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే, నియాన్ కలర్స్ డేను జాబిల్లి విభాగం పిల్లలు వారి గ్రాండ్ పేరెంట్స్ డే ఉత్సాహంగా శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్కూలు చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ మాట్లాడుతూ కుటుంబ విలువలపట్ల పిల్లలకు తెలియజేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, ప్రిన్సిపల్ లావణ్య, హెచ్ఓడి కృష్ణకిషోర్, ఏఓలు, టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-పామర్రు : రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం వైసిపి నాయకుల సహజ లక్షణమని కృష్ణాజిల్లా టిడిపి ప్రచార కార్యదర్శి చాట్ల పెదరమేష్, పామర్రు పట్టణ కార్యదర్శి మంతెన రామాంజనేయులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మాట్లాడుతూ మొన్నటి వరకు తల్లికి వందనం, పింఛన్ల పంపిణీ, స్త్రీ శక్తి పథకాలపై అసత్య ప్రచారాలు చేశారని అయినా ప్రజలు వాటిని నమ్మలేదు అన్నారు. ఇప్పుడేమో ఎరువులు లేవని రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలతో ప్రజల మధ్యకు వెళ్తే ప్రజలే వారికి గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాలిపర్తి ప్రసాద్,వినీల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

లయోల కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో శనివారం హిందీ భాషా దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత హిందీ విభాగాధ్యక్షులు, "అనువాద సాహిత్య రత్న", కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిందీ భాష విశిష్టత, ప్రాధాన్యతలను గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. హిందీ సాహిత్యంలో ఉన్న మాధుర్యం, ఆ భాషకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గౌరవం, హిందీ నేర్చుకోవడం వల్ల ప్రయోజనాలు, ఉద్యోగ అవకాశాలను ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ డా.మెల్కియోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ డాక్టర్ బి.సురేష్, ప్రాచ్య భాషల విభాగాధ్యక్షులు డాక్టర్ కె.శేఖర్, అధ్యాపకులు కాకాని ప్రకాష్ రావు, స్నేహల్ శుక్ల,బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందినవారికి బహుమతి ప్రదానం చేశారు.

శేషు మాస్టారుకు నివాళి

ప్రజాశక్తి - తిరువూరు

ఏ సమస్య ఉత్పన్నమైనా వాటిని పరిష్కరించేటువంటి ధైర్యం శేషు మాస్టారుకే ఉందని పూర్వపు ఉషాకిరణ్ పాఠశాల వ్యవస్థాపకులు వి.శ్రీనివాసులు అన్నారు. ప్రశాంతి విద్యాసంస్థల అధినేత కొత్తగుండ్ల వెంకట శేష హనుమతురావు (శేషు మాస్టారు) సంతాప సభ పూర్వపు ప్రశాంతి స్కూల్ ఆవరణలో కుటుంబ సభ్యులు, గతంలో పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎల్ఐసి ఏజెంట్ల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎల్ఐసి తిరువూరు శాటిలైట్ కార్యాలయ మేనేజర్ ఎం.రమేష్, అర్ కె డిజిటల్ ట్రాన్స్ పర్మేషన్ గ్రూ పు అధినేత జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హనుమంతరావు విద్యా రంగంలోనే కాకుండా జీవిత బీమా రంగంలో కూడా ప్రజలకు మంచి సర్వీస్ అందించారన్నారు. కార్యక్రమంలో నాగార్జున జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శేషగిరిరావు, స్కూల్ ప్రిన్సిపల్ కె.నరసింహారావు, శ్రీనిధి స్కూల్ కరెస్పాండెంట్ ఎంకిషోర్ బాబు, సత్య బి.ఇడి కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు హనుమంతరావు విశిష్టతను వివరించారు.

డ్రైనేజీ పనులు పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి

పెనుగంచిప్రోలు మండలంలోని సుబ్బాయి గూడెం దళితవాడలో జిల్లా పరిషత్తు నిధులు రూ.8 లక్షల నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను జెడ్పిటిసి సభ్యురాలు ఓట్ల నాగమణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగంగా నాణ్యతగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాపినేని వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ మొరంపుల పూర్ణయ్య, వైసిపి మాజీ మండల అధ్యక్షులు ఓట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ స్ఫూర్తితో ..

రజకుల హక్కుల కోసం పోరాడాలి

- వర్ధంతి సభలో మన్నూరు భాస్కరయ్య పిలుపు

ప్రజాశక్తి-విజయవాడ

చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణకు నివాళులర్పిస్తున్న నేతలు

చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ స్ఫూర్తితో రజకుల సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పిలుపునిచ్చారు. సింగ్ నగర్ 63వ డివిజన్ సుందరయ్య కాలనీ , రజక వీధిలో రజకవృత్తిదారుల సంఘం నాయకులు లింగాల నిర్మల అధ్యక్షతన చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభ శనివారం జరిగింది. ముందుగా ఐలమ్మ, రామకృష్ణల చిత్రపటాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా తీవ్ర మోసం చేస్తుందని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను రజకులకు అమలు జరపాలని డిమాండ్ చేశారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు పూర్తయిన వారికి పింఛన్లు, ఇస్త్రీ చేస్తున్న వత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వర్ధంతి సభలో ప్రజా సంఘాల నాయకులు సాంబిరెడ్డి, రజక వత్తిదాల సంఘం నాయకులు పార్వతి, జగన్, సుబ్బులు, నాని, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అలరించిన పౌరాణిక పద్య నాటకాలు

ప్రజాశక్తి-విజయవాడ

సత్యహరిశ్చంద్రలో ఓ సన్నివేశం

గయోపాఖ్యానంలో సన్నివేశం

జై శబరీష కళానాట్యమండలి (విజయవాడ) సమర్పణలో.. ఆంధ్రప్రదేశ్ భాష సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సౌజన్యంతో శనివారం రాత్రి స్థానిక గాంధీనగర్ కౌతాపూర్ణానందం కళా వేదికపై రెండు పౌరాణిక పద్య నాటక ఘట్టాల ప్రదర్శనలు జరిగాయి. "గయోపాఖ్యానం" (వార్ సీన్)లో శ్రీకృష్ణుడుగా తిరుపతయ్య, అర్జునుడుగా అగురు త్రినాథ్ నాయుడు మెప్పించారు. "సత్యహరిశ్చంద్ర" (వారణాసి సీను)లో హరిశ్చంద్ర పాత్రల్లో అప్పలనాయుడు, సతీష్ పాల్, నక్షత్రకుడిగా గాబ్రియేల్, చంద్రమతిగా అడపా ప్రభావతి, కాలకౌశికుడిగా ఎంఎస్ నాయుడు, లోహితాసుడుగా చింతా ప్రణవసాయి పాత్రోచితంగా నటించారు. సంగీతం బొత్సా సూర్యనారాయణ అందించారు. క్లారినెట్‌గా శేఖర్, డోలక్‌కు మార్కాపురం రాము, డ్రస్ అండ్ మేకప్‌మెన్‌గా సుబ్బయ్య వ్యవహరించారు. మైక్ అండ్ లైటింగ్‌కు రాము, ఆర్గనైజర్‌గా జొన్నా రంగారావు ఉన్నారు. ముఖ్య అతిథులుగా గుమ్మడి జయరాజు కళాపీఠం ట్రెజరర్ గుమ్మడి జీవన్ కుమార్, మంగమ్మ తల్లి కళా నాట్యమండలి అధ్యక్షులు మోడి ఆంజనేయులు, మనోహర క్రైస్తవ కళానాట్యమండలి అధ్యక్షులు విఠల్ మాస్టర్, సాల్మన్ రాజు (ఎస్బీఐ), మోత్రు ఆంటోనీ పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- విజయవాడ :

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ బెంజ్ సర్కిల్ ప్రాంతంలో ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం కరపత్రాలు పంపిణీ చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నగర కార్యదర్శి రాజు మాట్లాడుతూ ఈ నెల 15న రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు చలో విజయవాడ పిలుపునివ్వడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెంజ్ సర్కిల్ కమిటీ కార్యదర్శి మాజేటి నాగమల్లేశ్వరరావు, నాయకులు ఏడుకొండలు, అప్పారావు, రాజు దుర్గారావు, వి రాంబాబు, అశ్విని కుమార్ నగర కమిటీ సభ్యులు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎసిఎ నూతన ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ రాబోయే రంజీ క్రికెట్ సీజన్ 2025-26కు అంతరాజతీయ ఖ్యాతి పొందిన న్యూజిలాండ్ క్రికెట్ కోచ్, మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్‌ను సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక రాష్ట్ర స్థాయి క్రికెట్ అసోసియేషన్ విదేశీ క్రికెటర్‌ను కోచ్‌గా నియమించడం ఇదే ప్రథమం. రాష్ట్రంలో క్రికెట్‌ను ప్రోత్సహించే క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో రాష్ట్ర క్రికెట్ ప్లేయర్స్‌కు స్థానం దక్కాలన్న ధ్యేయంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ నియామకం చేపట్టిందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యారీ స్టీడ్ వ్యూహాత్మక చతురత అన్ని ఫార్మాట్లలో అద్భుత పనితీరు, ట్రాక్ రికార్డును కలిగి ఉన్నారని, ఆయన నాయకత్వం ఏసీఏ క్రికెట్ ప్లేయర్స్‌లో పోటీతత్వాన్ని పెంచుతుందని తెలిపారు. ఎసిఎ కార్యదర్శి సనా సతీష్ బాబు మాట్లాడుతూ "గ్యారీ నియామకం ఆంధ్ర క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందని, అతని ప్రపంచ అనుభవం, విలువలు, సమగ్రత, పనితీరు ఎసిఎ దార్శనికతకు సరిగ్గా సరిపోతాయని తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కాలిఫోర్నియా బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే పదార్థాలు శక్తినివ్వడానికి, జీర్ణక్రియకు సహాయపడటానికి ఎంతగానో ఉపయోగపడతాయని మాక్స్ హెల్త్‌కేర్ డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా అన్నారు. నగరంలోని మా మ్యాక్స్ హెల్త్ కేర్‌లో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె అట్లాడుతూ పోషకాలు అధికంగా ఉండే బాదం, సబుదాన. బుక్వీట్ (కుట్టు), సమక్ రైస్ తీసుకోవాలని తెలిపారు.

షాపు ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, సుబ్బారావు

ప్రజాశక్తి-విజయవాడ

వెంకటేశ్వరావు

సుబ్బారావు

షాపు ఎంప్లాయీస్ యూనియన్ 30 మందితో నూతన కమిటీ ఏర్పడింది. శుక్రవారం బాలోత్సవ్ భవన్‌లో షాపు ఎంప్లాయీస్ యూనియన్ 15వ మహాసభ జరిగిన విషయం తెలిసిందే. మహాసభ సందర్భంగా ఏర్పడిన నూతన కమిటీ వివరాలను నూతనంగా ఎన్నికయిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వై సుబ్బారావు శనివారం మీడియాకు వివరించారు. యూనియన్ గౌరవ ధ్యక్షులుగా సి.హెచ్.బాబూరావు, అధ్యక్షులుగా జి.వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా వై.సుబ్బారావు, కోశాధికారిగా ఈశ్వరచంద్ర కుమార్, ఉపాధ్యక్షులుగా ఎ.ఏడుకొండలు, విజయలక్ష్మి, డి.ప్రకాష్. లీలావతి, సహాయ కార్యదర్శిలుగా ఏ.హేమ, సి.హెచ్.శివరావు, ఆర్.దుర్గ, ఎస్.కె.రంజాన్ ఎన్నికయ్యారు. మరో 18 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నగర శ్రామిక మహిళ కమిటీ ఏడుగురితో ఏర్పడింది. కన్వీనర్‌గా ఏ.హేమ, సభ్యులుగా ఆర్.దుర్గ, ఎన్.విజయలక్ష్మి, లీలావతి, శ్యామల, డి.రాణి, దేవీ ఎన్నికయ్యారు.

భవిష్యత్తు కర్తవ్యాలు :కేరళ, తమిళనాడు తరహాలో ఏపీలో కూడా చట్టం చేయాలని, సంక్షేమ పథకాలు అమలు జరపాలని, షాపుల్లో కూర్చునే అవకాశం కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వెల్ఫేర్ స్కీమ్స్ అమల జరపాలని, ఇల్లు లేని షాప్ ఉద్యోగులకు 2 సెంట్లు స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని తదితర అంశాలపై భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.